# అదీ ఉద్యోగం

ఒకరోజున ఒక ఆఫీసులోకి వెళ్ళాను.

నేను వెళ్ళాననడంలో అత్యవసరత్వం యిమిడి ఉందన్నమాట. అంత అవసరమే లేకపోతే ఏ ఆఫీసుకు, ఏ ఆఫీసరుదగ్గరకు వెళ్ళనేవెళ్ళను. వెళ్ళన మంటే భయంకూడానూ. ఈ పాతికసంవత్సరాల లోనూ ఒక్కసారి ఒక గెజెటెడ్ ఆఫీసరును చూద్దామని, నాఅంతట నేను వెళ్లి పగలు పన్నెండుగంటలలో ఏరెండుగంటలో ఉదయం కాలకృత్యాలకు భోజనానికి పోగా మిగిలిన పదిగంటలూ కాచుకొనిఉండి చూడడం తటస్థించకుండా వచ్చాను. మరొకసారి ఒక పెద్దమనిషిద్వారా ఒక డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటును చూశాను. ఇక ఆఫీసరునే ఎరగను.

ఏ ఆఫీసుకూ నాఅంతట నేను ఒంటరిగా వెళ్లలేదన్నమాటే, ఆమధ్య తాలూకాఫీసులో పనిచేసిన నాలుగునెలలూ తప్ప. ఆఉద్యోగమయినా ఒకర్ని చూడవలసిన అవసరములేకుండా వచ్చింది గనుక చేశాను. లేకపోతే ఆఉద్యోగమూ దొరకదు. నేను చేయనూచేయను. అంతకు తరువాతగాని, అంతకు పూర్వంగాని, ఆఫీసుకు వెళ్లితే ఎవరితోనైనా స్నేహితులతో వెళ్లవలసిందే. లేకపోతే వాళ్లేమనుకుంటారో అని భయం.

ఇప్పుడూమాత్రం ఒంటరిగా వెళ్ళడం తప్పలేదు. ఆఫీసుగేటుముందరే ఒకకుక్క తయారుఅయింది. అది నన్నుచూసేచూడడంతోనే భొంయిమని లేచింది. అది నన్నేం కరుస్తుందని భయంవెయ్యలేదుగాని, అపశకునమేమో నని భయంవేసింది. సబ్‌ట్రెజరీ ఆఫీసరు త్వరగా రాడేమో, షరాబు భోజనంచేసి సిగరెట్టుకాల్చుకుంటూ వచ్చేసరికి ఏరెండుగంటలు దాటుతుందో. ఆరోజు చలానారసీదు యూనివర్శిటీకి పంపగల్గుదునో లేనో అని అనుమానంవేసింది. అయినా పిల్లికనబడితే అపశకునం పిల్లికి విరోధిఅయిన కుక్కకనపడితే మంచి శకునమే అని సరిపుచ్చుకొన్నాను. కాని ఈ కుక్క భొంయిమంటూ మీదికివచ్చింది! కుక్క కనబడడం మంచిదేకావచ్చు కుక్క అరవడమో? ఈవిషయమయి ఆలోచించడానికిమట్టుకు నాకు వీలు చిక్కలేదు. ఆశిరస్తాదారుగారు నామైకం కట్టుకుంటే నేనువెళ్ళి అరసీదు రిజిష్టరుకవరులో యూనివర్శిటీకి పంపాలె. ఎంత ఆలస్యమవుతుందో ఏమో? రెండు గంటలుదాటితే పోస్టాఫీసులో రిజిష్టరు చేయరు. ఆయనగారితో మాట్లాడం ఏలాగో! నేను పనిచేసిన తాలూకాఫీసులోఆయనలాగానే ఈయన కూడా అతి చాదస్తుడూ, ముక్కోపీ అయితే ఇక నాపని చెప్పనక్కర్లేదు ఈ ఆలోచనలు నన్ను కలవరపెడుతూంటే మెల్లగా ఆఫీసువరండా చేరాను.

షరాబుగారు కూర్చుండేచోటికి వెళ్లాను. అక్కడ షరాబులేడు. సబ్‌ట్రెజరీ ఆఫీసరూలేడు. సాధారణంగా ఆఫీసుకు గుమాస్తాలుగాని, ఆఫీసర్లుగాని ఒక గంట ఇటోఅటో – తెలుసుగా అదే – వస్తూంటారని నేను పదకొండున్నరకు మాయింటిదగ్గర బయలుదేరి పన్నెండింటికి ఆఫీసుకు వెళ్లాను. ఆఫీసులోమటుకు ఎవ్వరూ లేరు, ఒకరిద్దరుతప్ప. నేనేమైనా పొరపాటు పడ్డానేమోనని గడియారమువైపు చూశాను. అదీ పొరపాటుపడలేదు చివరకు తాలూకాఫీసు గడియారంకూడా పొరపాటుపడలే. అయినా తాలూకాఫీసు ఉద్యోగస్థులు ప్రపంచకానికి కొన్నిగంటలు వెనకాల ఉంటారని అప్పుడు నాకు జ్ఞాపకంవచ్చింది. ఒక్కొక్క తాహసీల్దారుకు సాయంత్రం ఆరుగంట లప్పుడు పదకొండుగంటలయి రాత్రి పదకొండు పన్నెండింటికిగాని అయిదుగంటలుగాదు. ముసలివాడై ఇంటిదగ్గర ఏమీ యావలేకపోతే పొద్దున్నే పదకొండుగంటలవుతుంది; అర్ధరాత్రి అయినా అయిదు గంటలుగాదు. చిన్నవాడై ప్రాపకంవల్ల తాసీల్దారయితే ఆఫీసుటయిము అయిదుగంటలూ అక్కడె అయి

పోతవి వాళ్ళవేళకూ నక్షత్రగ్రహసంచారానికీ సంబంధమేలేదు. వాళ్ళనుబట్టే మిగిలినవారూనూ.

సిరస్తాదారుగారు ఎంతసేపటికి వస్తారో కనుక్కుందామని అక్కడే ఒక జవానుంటే- అతను జవానే అనుకున్నా మెడలో డవాలు అదీవుంది- "సిరస్తదారుగారు ఎప్పుడు వస్తారయ్యా?" అన్నాను. అతనికి నామాటలు వినపడనేలేదు. వినపడలేదేమో పరధ్యాన్నంగా ఉండడంవల్ల పెద్దగా చెప్పుదామనుకున్నాను. అయినా "నాకు చెముడా" అని అతను అంటాడేమోనని మెల్లిగానే "సిరస్తాదారుగారు ఎప్పుడు వస్తారు" అన్నా. అతను నావైపు తిరిగి 'ఎవరికి తెలుసు' అని నిర్మొహమాటంగా జవాబుచెప్పాడు. కాలుగాలినపిల్లిలా అక్కణ్ణుంచి వెళ్ళాను.

మేజస్ట్రీటుగారు అవతల కోర్టులో కేసులు విచారిస్తున్నారు. అప్పటికే జనం బయట వరాండాలో కూర్చుని గుసగుసలాడుకుంటున్నారు. ప్రతివాళ్ళ వ్యవహారాలు ఆ కూర్చున్న కాసేపులోనే కావాలి. ఏమిటో ఒకటే మాట్లాడడము. చాలాసేపు ఊరుకున్నాడు ఆ మేజస్ట్రీటుగారు. చివరకు కోపంవచ్చింది కాబోలు రామూమరి. ఊరకనే, కారణంలేకుండా జవాన్లకు కోపంవస్తూంటే, ఆఫీసరుకు, అందులో క్రిమినల్ పవరుచేతిలో ఉన్నాయాయనకు కారణం ఉన్నప్పుడు కోపంరావడం ఆశ్చర్యమేముంది- జవానును పిలిచి "మాట్లాడేవాళ్లను అవతలికి వెళ్ళమను. ఏమిటా గోల" అన్నాడు. అసలు జవాన్లు చెలాయించే అధారిటీకి ఒకళ్ళు చెప్పనవసరమే లేదు. అందులోనూ పై అధికారుల ఆజ్ఞ లభించిందంటే వాళ్ల తెలివితేటలన్నీ ఉపయోగించారన్నమాటే.

జవాను గబగబ బయటకువచ్చి "ఏమిటయ్యా! ఏమిటాగోల!! పెద్దవాళ్లుగూడానూ. మాట్లాడేవాళ్లు క్రిందికిదిగి మాట్లాడండి. లోపల కోప్పడుతున్నారు మమ్మల్ని." అని కేకలువేశాడు. అప్పుడే వచ్చాడు ఒకాయన రోజుకుంటూ. వచ్చి ఇంకోరితో ఏమిటో రహస్యంగా మాట్లాడుతున్నాడు. జవాను కాలన్ని రుద్రుడై "ఏమయ్యా! ఇప్పుడేగా నోరుచించుకొని చెప్పింది. జ్ఞానంలేదు. లే అక్కడ. అవతలికి పో!" అన్నాడు. ఆయన నిర్ఘాంతపోయి ఆజనంవైపూ, ఆజవానువైపూ బిత్తరిచూపులు చూస్తూ మొహం చిన్నబుచ్చుకున్నాడు.

"పీడదుంపతెగా! ఎంతేసిమాటలన్నాడు. ఈ కాలపు స్కూళ్లల్లో విద్యార్థులమీద ఉపాధ్యాయులకు ఈ జవానుకున్నంత అధికారమున్నా స్కూళ్లు బాగుపడిపోను" అనుకున్నాను.

ఇంతలో సిరస్తాదారుగారు వచ్చారు. ఆయనరాగానే వెళ్ళినాలాభంలేదని కొంచెంసేపు అక్కడేఉండి తరువాత వెళ్లాను. నేవెళ్లేసరికి నలుగు రయిదుగురు తాలూకాగుమాస్తాలు కాగితాలు చేత్తోబుచ్చుకుని ఆయనను చూపించడానికి నుంచున్నారు. వీళ్లందరూ మాట్లాడడం కావాలె. అప్పుడు ఆయన చలానాలు తీసుకోవాలె. ఆరోజున అప్లికేషను ఫారము రిజస్టరు చేయకపోతే చాలాయిబ్బంది. ఆపనిఅయి ఆయన పిలిచేసరికి ఆలస్యంఅవుతుంది ఫారం యిచ్చివద్దామని లోపలికి వెళ్లానుమెల్లెగా.

సిరస్తాదారుగారు గుమస్తామీద ఏమిటో కేకలు వేస్తున్నారు. అప్పుడు చలానాయిచ్చే వీలేమీ కనపడలేదు. ఆయన కేకలు ఆపింతర్వాత యిద్దామని అట్లానుంచొని ఉన్నా. ఇంతలో ఏమూలనో పనిచేసుకుంటూన్న జవాను- ఇందాక నాకేంతెలుసు అన్నాతనే. "ఏమయ్యా! ఎందుకువచ్చావు?" అన్నాడు. నేను నాచేతిలో ఫారం చూపించాను.

"ఎక్కడికి తీసుకువెళ్లుతున్నావు. ఇటుతే బుడబుడ లోపలికిరావడమే ప్రతివాళ్లూ. బయటనుంచి ఇవ్వలేవూ!" అన్నాడు.

"నీవు గేటుదగ్గరలేందే" అన్నాను మెల్లిగానే.

"నువ్వవచ్చావని తెలియలే. వచ్చిందాకా ఆగు" అన్నాడు. అతనితో నాకెందుకు అని ఫారం అతనికిచ్చి యివతలికి వచ్చాను.

ఎంతసేపు కూర్చున్నా అంతుపొంతు కనబడింది కాదు. ఎండకాస్తున్నది. నన్ను పైకంపట్టడానికి కేక

చేయలేదు. నాఅంతట నేను లోపలికి వెళ్లితే ప్రతివె... మాట్లాడేవాడే. లోపలికి వెళ్లకపోతే ఆరోజు రిజిష్టరు చేసేవేళయిపోతున్నది. నాకు ఏమీ తోచలే.

కూర్చొని కూర్చొని కొంతసేపటికి మనసుపట్టలేక లోపలికి వెళ్ళాను. శిరస్తాదారు అగుమాస్తాలతో ఏదో మాట్లాడుతున్నాడు- మాటలంటే కేకలలాంటివి. జవాను నావైపు చూశాడు. నేను ఎంతవరకొయిందన్నాను. "అవుతుందిలే. తొందరపడితేఏలా అవుతుందీ. మేంపిలవమా అయితే" అన్నాడు. నాకు బోధపడలేదు వాడిదర్జా. తిరిగి వరాండాలోకి వెళ్ళాను.

కొంతసేపటికి శిరస్తాదారు నాఫారం చేతులో పుచ్చుకుని "ఎవరయ్యా ఈయన ఇటురమ్మను" అన్నాడు ఆకప్పగొంతులో. ఏమవుతుందో అని నేను జాగ్రత్తగా వింటున్నాను. వెంటనే దగ్గరకువెళ్ళాను. "ఏమయ్యా చదివేవు లేకఇరవయ్యి అనిఅంటే ఏదోబకటే కొట్టివేయకపోతే ఏలా తెలుస్తుందయ్యా మాకు? ఏంచదువులయ్యా! ఇవేంచదువులో - బియ్యేలకీ, ఎమ్మేలకీ వస్తారు ఏమీతెలియదు. మాకాలంలో ఇంత అన్యాయంలేదు" అంటూ ఒకచిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

ఆయన అభిప్రాయం ఆయనతెలివితేటలకు, గొప్పతనానికీ ఆయనకు ఆశిరస్తాదారు ఉద్యోగంఇచ్చారని- బియ్యేపరీక్ష అయితేకూడా రిటైర్ కావచ్చే ఈడుకు శిరస్తాదారులో ఉన్నా.

నేను కొట్టివేయకపోవడము పొరపాటు, లేకపోతే అసంగతి తెలియకనా? అయినా ఆయనదగ్గర మన పని త్వరగా కావలసిఉండడంచేత, పనిఅయితే మాపరస్పరాధికార్యాలతోనూ, తెలివితేటలతోనూ అవసరం లేకపోవడంచేతా నేను ఆయనఅభిప్రాయంఆమోదించే, చూపుతో ఆయన అధికార్యాన్ని ఒప్పుకుంటున్నట్టు నటిస్తూ సందర్భంలేకపోయినా రిజిష్టరుటయిము అయిందని ఆయనకుతెలియదాలేదని "రిజిష్టరు చేసే టయిము అయిందండీ, పొరపాటు" అని అది తీసుకుని ఒకటి కొట్టివేసి యిచ్చాను.

అక్కడే షరాబుకు సైకంఇవ్వడం. అందుకని ఆయన దగ్గిర్నుంచి షరాబువైపుకూ రెండుఅడుగులు వేశాను. అజవాను "అటురా, ఇటునుంచేనా?" అన్నాడు. "చిత్తం" అని పెద్దగాఅన్నాను. మొందట వెళ్ళబోయినాడు. తరువాత వేళాకోళానికి అన్నానని తెలుసుకున్నాడేమో తీక్షణంగా చూశాడు. కడుపులో అక్కసున్న బయటకు కనబరచినతర్వాత వాడెలా చూస్తే ఎవరిక్కావాలి?

తీరా పనిచేసుకు నేసరికి రెండున్నరఅయింది. తొందరగా పోస్టాఫీసుకెళ్లుదామని నడుస్తుంటే గేటుదగ్గర కుక్క మళ్లీ భొంయిమన్నది. దీనికిగూడా తాలూకాఫీసులో ఉద్యోగంకాబోలు ననుకున్నాను. లేకపోతే వచ్చేవాళ్ళమీద వెళ్ళేవాళ్ళమీద అధికారం చెయ్యడానికి దానికంత దర్జా ఎక్కడిదా అనుకుంటూ నాపనిమీద వెళ్ళాను.

మెం. శా. వెంకట సుబ్రహ్మణ్యశర్మ

